అ'పూర్వ' సమ్మేళనం

సమావేశంలో పాల్గొన్న పూర్వవిద్యార్థులు

కమాన్‌చౌరస్తా, జూన్ 23 : జిల్లా కేంద్రంలోని హౌసింగ్‌బోర్డు కాలనీలో గల కుమార్‌వాడీ పాఠశాల 1974-75 విద్యార్థులు ఆదివారం పాఠశాల ఆవరణలో పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహించారు. కార్యక్రమానికి అప్పటి ఉపాధ్యాయులు సుగుణ ప్రత్యేక ఆహ్వానితులుగా హాజరై మాట్లాడారు. అప్పటి పాఠశాల విషయాలు నెమరువేసుకున్నారు. అనంతరం ఉపాధ్యాయులను సత్కరించారు.

వివేకానంద విద్యానికేతన్‌లో 'ఆశీర్వచన్'

విద్యార్థులను ఆశీర్వదిస్తున్న తల్లిదండ్రులు

కమాన్‌చౌరస్తా, జూన్ 23 : జిల్లా కేంద్రంలోని భగత్‌నగర్ వివేకానంద విద్యానికేతన్ విద్యాసంస్థల్లో పదో తరగతి చదువుతున్న విద్యార్థులతో ఆశీర్వచన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. దీనికి గర్రెపల్లి మహేశ్వర శర్మ, రామాచార్యులు హాజరయ్యారు. విద్యా సంస్థల చైర్మన్ సొగాని కొమురయ్య విద్యార్థుల్లో ఆత్మీయత అనుబంధాలను పెంపొందించేందుకు పాదపూజ కార్యక్రమం నిర్వహించినట్లు తెలిపారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ మిథున్ జే మిస్త్రి, వైస్ ప్రిన్సిపాల్ సాగర్, ఏవో తుంగాని సంపత్, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

క్రీడా యువజన చైతన్య మూర్తికి శ్రద్ధాంజలి

- అంతర్జాతీయ యోగా క్రీడాకారుడు నాగిరెడ్డి సిద్ధారెడ్డి

రామారావు చిత్రంపటం వద్ద నివాళులర్పిస్తున్న సిద్ధారెడ్డి, తదితరులు

కొత్తపల్లి, జూన్ 23 : కరీంనగర్ ఉమ్మడి జిల్లాలో క్రీడా, సాహిత్య, యువజన రంగాల్లో యువకులను చైతన్యపరిచిన మార్గదర్శకుడు జిల్లా మాజీ యూత్ కోఆర్డినేటర్ వేముగంటి రామారావు అని అంతర్జాతీయ యోగా క్రీడాకారుడు నాగిరెడ్డి సిద్ధారెడ్డి అన్నారు. ఇటీవలే అకాల మరణం పొందిన వేముగంటి రామారావు నివాసంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు. రామారావు సేవలను కొనియాడారు. కార్యక్రమంలో రామారావు సోదరుడు జితేందర్‌రావు, తెలంగాణ పాలిటెక్నిక్ కళాశాలల సంఘం ఉపాధ్యక్షుడు మధుసూదన్ రెడ్డి, యోగా కోచ్ వావిలాల కిష్టయ్య ఉన్నారు.

ఫర్టిలిటీ సెంటర్ ప్రారంభం

ఆటోమ్ ఫర్టిలిటీని ప్రారంభిస్తున్న రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్

విద్యానగర్, జూన్ 23: జిల్లా కేంద్రంలోని మంచిర్యాల చౌరస్తా ఆదర్శ నగర్‌లో ఆటోమ్ ఫర్టిలిటీ సెంటర్‌ను ఆదివారం రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా డాక్టర్లు రాకేశ్ రెడ్డి, వాసవీ రెడ్డిలతో పాటు హాస్పిటల్ సిబ్బందికి మంత్రి పొన్నం ప్రభాకర్ శుభాకాంక్షలు తెలిపారు. ఇక్కడ హాస్పిటల్ బాధ్యులు, సిబ్బంది ఉన్నారు.

విద్యార్థులు క్రీడల్లోనూ రాణించాలి

విద్యార్థులకు క్రీడావస్తువులు పంపిణీ చేస్తున్న బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు జీవీఆర్

మానకొండూర్, జూన్ 23 : నేటి పోటీ ప్రపంచంలో విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు జీవీ రామకృష్ణారావు అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని గడిమహాల్‌లో ఆయా పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు జీవీఆర్ క్రీడా సామగ్రి (క్రికెట్ బ్యాట్లు, షటిల్ బ్యాట్లు, కార్క్స్ బాల్స్) పంపిణీ చేశారు.

వీల్ చైర్ అందజేత

వీల్‌చైర్‌ను అందజేస్తున్న ఆదరణ సేవా సమితి బాధ్యులు

హౌసింగ్‌బోర్డుకాలనీ, జూన్ 23: ఆదరణ సేవా సమితి ఆధ్వర్యంలో ఆదివారం అంగవైకల్య బాధితుడికి వీల్ చైర్‌ను అందజేశారు. కేశవపట్నం మండలం లింగాపూర్ గ్రామంలో వెన్నెముక విరిగి కొన్ని సంవత్సరాలుగా మంచానికే పరిమితమైన చల్లూరు కుమారస్వామికి రూ.15 వేల విలువైన వీల్ చైర్‌ను మేకల కనకయ్య జ్ఞాపకార్థం వారి కుమారుడు మేకల గంగయ్య అనురాధ సహకారంతో అందించారు. కార్యక్రమంలో ఆదరణ సేవ సమితి బాధ్యులు, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

నోట్ బుక్స్ పంపిణీ

నోట్ బుక్స్ పంపిణీ చేస్తున్న మేము సైతం ఫౌండేషన్ బాధ్యులు చకిలం స్వప్న శ్రీనివాస్

విద్యానగర్, జూన్ 23: మేము సైతం యువసేన ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక బోయవాడలో స్కూల్ పిల్లలకు నోట్ బుక్స్ పంపిణీ చేశారు. కొమురవెల్లి అశోక్, స్వర్ణలత, తేజ, మౌనిక, క్రితిక సహకారంతో సుమారు 70 మంది పిల్లలకి నోట్ బుక్స్, స్టేషనరీ ఐటమ్స్ అందజేశారు. ఇక్కడ ఫౌండేషన్ సభ్యులు రూప, హనురు తదితరులున్నారు.

'కరీంనగర్ కవులు నాడు నేడు' పుస్తకావిష్కరణ

పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న శ్యాంప్రసాద్‌లాల్

కమాన్‌చౌరస్తా, జూన్ 23 : జిల్లా కేంద్రానికి చెందిన తెలుగు యూనివర్సిటీ పూర్వపు వీసీ ఆచార్య అనుమాండ్ల భూమయ్య సంపాదకత్వంలో వెలువడిన 'కరీంనగర్ కవులు నాడు నేడు' అనే కవితా సంకలనాన్ని తెలంగాణ రచయితల సంఘం కరీంనగర్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో పెద్దపల్లి జిల్లా అదనపు పాలనాధికారి జీవీ శ్యాంప్రసాద్ లాల్ ఆవిష్కరించారు. తెలంగాణ రచయితల సంఘం అధ్యక్షుడు కొత్త అనిల్ కుమార్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో శ్యాంప్రసాద్‌లాల్ మాట్లాడుతూ, సాహిత్య రంగంలో కరీంనగర్ కవుల పాత్ర గొప్పదన్నారు. ఆనాటి నుంచి నేటి వరకు కవిత్వం రాసిన కవుల కవితలను సంకలనంగా తీసుకువచ్చి జన్మభూమికి సాహితీ కానుకగా ఇచ్చిన ఆచార్య అనుమాండ్ల భూమయ్య గారి కృషి అభినందనీయమన్నారు. సంపాదకుడు ఆచార్య భూమయ్య మాట్లాడుతూ, జన్మనిచ్చిన కరీంనగర్ కవుల కవితలను సంకలనంగా తీసుకు రావడం సంతృప్తి నిచ్చిందన్నారు. ప్రముఖ సాహితీవేత్తలు డాక్టర్ మలయశ్రీ, డాక్టర్ నలిమెల భాస్కర్, డాక్టర్ గండ్ర లక్ష్మణరావు, వారాల ఆనంద్‌ను ఆత్మీయంగా సత్కరించారు. ఇక్కడ దొమ్మాటి శంకర్, రాజారాం మోహన్‌శర్మ, కాండూరి వెంకటేశ్వర్లు, డాక్టర్ హరిదాస్, బొద్దుల లక్ష్మయ్య, వేణుశ్రీ, అన్నవరం దేవేందర్, కేవీఎస్ అనంతాచార్య, నగునూరి శేఖర్, బొమ్మకంటి కిషన్, పీఎస్ఎన్ రాజు, రామ్మోహన్‌రావు, నాగభూషణం, యుగందర్ ఉన్నారు.

కార్పొరేట్లకు కట్టబెట్టేందుకే వేలం

కలెక్టరేట్, జూన్ 23 : తెలంగాణలోని సహజ వనరులను కార్పొరేట్ శక్తులకు కట్టబెట్టే క్రమంలోనే దేశంలోని బొగ్గు బ్లాకులను కేంద్ర ప్రభుత్వం వేలం వేస్తోందని, మైనార్టీ మేధావుల ఫోరం రాష్ట్ర కార్యదర్శి మహ్మద్ ఇక్బాల్ విమర్శించారు. కార్పొరేట్ వ్యాపారులకు సహజవనరులు దారాదత్తం చేయడంపై పలు సామాజిక సంస్థలు, స్వచ్ఛంద సంఘాల ప్రతినిధులతో కలిసి నగరంలోని మంకమ్మతోట సంఘం జిల్లా కార్యాలయంలో ఆదివారం రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. అతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ, 500 బొగ్గు బ్లాకుల్లో ఇప్పటికే 300 ప్రైవేట్, కార్పొరేట్ సంస్థలకు కట్టబెట్టిందన్నారు. సమావేశంలో చల్లగొండ వెంకటేశ్వర్‌రావు, ముత్తినేని అశోక్‌రావు, మండల రాజేశం, తక్కలపల్లి రాములు, రాచకొండ శ్రీధర్, వేముల వెంకటరెడ్డి, చకిలం శ్రీనివాస్ గుప్త, పాల్గొన్నారు.

అభివృద్ధి పనులను వేగంగా పూర్తి చేస్తాం

- అవినీతిని సహించేది లేదు
- మంత్రి పొన్నం ప్రభాకర్

మాట్లాడుతున్న మంత్రి పొన్నం ప్రభాకర్

కార్పొరేషన్, జూన్ 23 : కరీంనగర్ నగరపాలక సంస్థలో అభివృద్ధి పనులను వేగంగా పూర్తి చేసేందుకు అన్ని చర్యలు తీసుకుంటామని రాష్ట్ర బీసీ సంక్షేమ, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. ఆదివారం డీసీసీ కార్యాలయంలో నగర కాంగ్రెస్ కార్పొరేటర్లు, మాజీ కార్పొరేటర్లతో ప్రత్యేకంగా సమావేశం అయ్యారు. నగరంలో సాగుతున్న అభివృద్ధి పనులు తదితర వాటిపై సమీక్షించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, నగరపాలక సంస్థలో ఎలాంటి అవినీతి జరిగినా తమ దృష్టికి తీసుకురావాలని వెంటనే చర్యలు తీసుకుంటామన్నారు. నగరపాలక సంస్థలో చేపట్టిన అభివృద్ధి పనులకు సంబంధించి ఫస్ట్ కమ్ ఫస్ట్ అనే పద్ధతిలోనే బిల్లులు చెల్లించడం జరుగుతుందన్నారు. నగరంలో సమస్యల పరిష్కారానికి అవసరమైన ప్రతిపాదనలు తీసుకువస్తే వాటికి సంబంధించి పనులు చేపట్టేందుకు చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. సమావేశంలో కార్పొరేటర్లు నేతికుంట యాదయ్య, బుచ్చిరెడ్డి, భూమాగౌడ్, గంట కల్యాణి శ్రీనివాస్, సరిళ్ల ప్రసాద్, మాజీ కార్పొరేటర్లు మాచర్ల ప్రసాద్, రాజేందర్, మెండి చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

కాళోజీనగర్‌లో దొంగల బీభత్సం

- మూడిళ్లలో చోరీలు
- 10 లక్షలకు పైగా సొత్తు అపహరణ

రాంనగర్, జూన్ 23: కొత్తపల్లి మండలం రేకుర్తిలోని కాళోజీనగర్‌లో ఆదివారం తెల్లవారుజామున దొంగలు బీభత్సం సృష్టించారు. కాళోజీనగర్‌లోని అక్షయ హోమ్స్‌లోని రెండిళ్లలో, పోచమ్మ కాలనీలోని ఒక ఇంట్లో వరుస దొంగతనాలకు పాల్పడి రూ.10 లక్షలకు పైగా సొత్తు అపహరించుకుపోయారు. తెల్లవారుజామున సమాచారం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని దర్యాప్తు ప్రారంభించారు. చోరీ జరిగిన ప్రాంతాలు గేటెడ్ కమ్యూనిటీ కావడంతో అక్కడ ఉన్న సీసీ కెమెరాల పుటేజీని పరిశీలించగా నలుగురు గుర్తుతెలియని దుండగులు చోరీలకు పాల్పడినట్లు గుర్తించారు. ఇదే మూతా అక్షయ హోమ్స్‌లో రెండిళ్లలో పోచమ్మ కాలనీలో ఒక ఇంట్లో చోరీ చేసినట్లు నిర్ధారణకు వచ్చారు. బాధితులంతా ఇండ్లకు తాళం వేసి స్వగ్రామానికి వెళ్లడంతో ఈ ఘటన చోటు చేసుకుందని పోలీసులు తెలిపారు. చోరీలు జరిగిన ఇండ్లను కరీంనగర్ రూరల్ సీఐ ప్రదీప్ కుమార్ క్లూస్ టీం నిపుణులు సీసీఎస్ పోలీసులు పరిశీలించారు. సీసీ పుటేజీ ఆధారంగా నిందితులు అర్ధరాత్రి దాటిన తర్వాత రెండున్నర ప్రాంతంలో చోరీలకు పాల్పడినట్లు గుర్తించారు. ఈ ఘటనల్లో జమున ఇంట్లో 1.85 లక్షలు, తిరుపతి ఇంట్లో 1.08 లక్షలు, రాజేందర్ ఇంట్లో రూ.95 వేల విలువైన బంగారు, వెండి ఆభరణాలు నగదు చోరీకి గురైనట్లు పోలీసులు తెలిపారు. అయితే వాస్తవంగా చోరీ సొత్తు విలువ రూ.10 లక్షల పైనే ఉంటుందని బాధితులు తెలిపారు. ఇళ్లకు తాళాలు వేసి ఇతర ప్రాంతాలకు వెళ్లిన సందర్భాల్లో చుట్టుపక్కల వారితో పాటుగా పోలీసులకు సమాచారం అందించాలని ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా గస్తీని ముమ్మరం చేస్తామని పోలీసులు తెలిపారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సాంబమూర్తి తెలిపారు.

సేంద్రియ సాగుపై అవగాహన పెరగాలి

కలెక్టరేట్, జూన్ 23 : సేంద్రియ సాగుపై ప్రతి ఒక్కరిలో అవగాహన పెరగాలని విశ్రాంత ఉద్యోగుల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు, విశ్రాంత వ్యవసాయాధికారి సముద్రాల జనార్దన్‌రావు అన్నారు. పురుగు మందులు వాడిన ఆహార పదార్థాలతో మానవ శరీరం విషతుల్యమవుతుందని, దీనిని నివారించాలంటే సేంద్రియ సాగు ద్వారా లభించే ఆహార పదార్థాలు వినియోగించాలని సూచించారు. సేంద్రియ సాగుపై ఆదివారం నగరంలోని కృషి భవన్‌లో నిర్వహించిన అవగాహన సదస్సులో ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈసందర్భంగా మాట్లాడుతూ, సేంద్రియ ఎరువు మొక్కల ఎదుగుదలలో ఎంతో ఉపయోగకారిగా ఉంటుందన్నారు. నేటి తరం రైతులు సేంద్రియ వ్యవసాయంపై దృష్టి సారించాలని కోరారు. ఇక్కడ రైతులు, పోటీ పరీక్షల అభ్యర్థులు, విశ్రాంత ఉద్యోగులు గట్ల శ్రీనివాస్, ఇరుమల్ల అశోక్, ఆరెల్లి సాయికృష్ణ, ఆశాడపు మహేశ్, కడారి సురేశ్, వెదిరె సంపత్, రాథోడ్ శేఖర్, జీఎస్ ఆనంద్ ఉన్నారు.

నవాబ్‌పేట్‌లో పాలాభిషేకం

చిగురుమామిడి, జూన్ 23: నవాబ్‌పేట్ గ్రామంలో కాంగ్రెస్ గ్రామ శాఖ ఆధ్వర్యంలో బస్టాండ్ వద్ద సీఎం రేవంత్ రెడ్డి, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ఫ్లెక్సీకి నాయకులు ఆదివారం పాలాభిషేకం చేశారు. రైతులకు రుణమాఫీ ప్రకటించడం హర్షణీయమన్నారు. ఇక్కడ కాంగ్రెస్ నాయకులు వంశీకృష్ణ, రవీందర్ రెడ్డి, ప్రవీణ్, రవీందర్ సింగ్, తదితరులున్నారు.

ఆర్థిక సాయం

మానకొండూర్ రూరల్, జూన్ 23: గట్టుదుద్దెనపల్లి గ్రామానికి చెందిన కనకం పుష్పలత, స్వరూప ఇటీవల మృతి చెందగా, ఆ పేద కుటుంబాలను ఆదివారం గ్రామ హెల్పింగ్ హాండ్స్ ఉద్యోగుల బృందం పరామర్శించింది. వారికి కొంత ఆర్థిక సాయం తోపాటు నిత్యావసర సరుకులను అందజేశారు. ఇక్కడ హెల్పింగ్ హ్యాండ్స్ ఉద్యోగుల బృందం సభ్యులు, గ్రామస్తులున్నారు.

విద్యుత్‌సమస్యలను సత్వరమే పరిష్కరిస్తాం

సైదాపూర్, జూన్ 23 : విద్యుత్ సమస్యలు తెలిపితే సత్వరం పరిష్కరిస్తామని ఏఈ బొమ్మ ఆంజనేయులు పేర్కొన్నారు. మండల కేంద్రంలోని సైదాపూర్‌లో లూజ్ లైన్లను సిబ్బంది సరిచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, విద్యుత్ అంతరాయం లేకుండా చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో లైన్‌మెన్ రజనీకాంత్, విద్యుత్ సిబ్బంది ఉన్నారు.

చేనేత సమస్యలను సీఎం దృష్టికి తీసుకెళ్తాం

- అఖిల భారత పద్మశాలీ సంఘం జాతీయ అధ్యక్షుడు కందగట్ల స్వామి

వెంకటేశం కుటుంబ సభ్యులకు ఆర్థిక సహాయం అందజేస్తున్న నాయకులు

కొత్తపల్లి, జూన్ 23 : రాష్ట్రంలో చేనేత కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను రాష్ట్ర చేనేత జౌళి శాఖ మంత్రి తుమ్మ ల నాగేశ్వరరావు సహకారంతో వారం రోజుల్లోగా సీఎం దృష్టికి తీసుకు వెళ్తామని అఖిలభారత పద్మశాలీ సంఘం జాతీయాధ్యక్షుడు కందగట్ల స్వామి, తెలంగాణ పద్మశాలీ సం ఘం అధ్యక్షుడు కామారపు మురళి అన్నారు. కరీంనగర్‌లోని కొత్తపల్లిలో ఇటీవల చేనేత పనులు లేక ఆత్మహత్యకు పాల్పడిన బొల్లబత్తిని వెంకటేశం, సిరిమల్ల గణేశ్ కుటుంబాలను ఆదివారం కమిటీ సభ్యులతో కలిసి ప రామర్శించి వారికి ఆర్థిక సాయం అందజేశా రు. చేనేత కార్మికులు అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారని వాటిని పరిష్కరించే దిశగా వారం రోజుల్లోగా సీఎం దృష్టికి తీసుకెళ్తామన్నారు. ఇక్కడ జాతీయ పద్మశాలీ సంఘం ప్ర ధాన కార్యదర్శి గడ్డం జగన్నాథం, సంఘం రాష్ట్ర గౌరవాధ్యక్షుడు మెతుకు సత్యం, ప్రధా న కార్యదర్శి మాచర్ల రామచంద్రరావు, రాజకీయ వ్యవహారాల కమిటీ చైర్మన్ వాసాల రమేశ్, చేనేత సెల్ విభాగం రాష్ట్ర అధ్యక్షుడు కందగట్ల భిక్షపతి, పద్మశాలీ సంఘం రాష్ట్ర మీడియా ప్రధాన కార్యదర్శి మార్త ప్రకాశ్, జిల్లా సంఘం నాయకులు స్వర్గం నర్సయ్య, వేముల చంద్రశేఖర్, పట్టణాధ్యక్షుడు కమటం రాజేశం, నాయకులు పెంటి శేఖర్, పెంటి శ్రీకాంత్ తదితరులున్నారు.

'వితంతువులకు సమానత్వం కల్పించాలి'

హుజూరాబాద్ రూరల్, జూన్ 23 : వితంతువులకు సమాజంలో సమానత్వం రావాలని బాలవికాస సంస్థ బాల వికాస ఏరియా మేనేజర్ ఎండీ ఖాజాబీ పేర్కొన్నారు. అదివారం బాలవికాస ఆధ్వర్యంలో మండలంలోని పోతిరెడ్డిపేటలో అంతర్జాతీయ వితంతువుల దినోత్సవాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ఖాజాబీ మాట్లాడుతూ వితంతువు వివక్షపై మూఢ నమ్మకాలను పారదోలాలని పిలుపునిచ్చారు. ఇక్కడ హుజూరాబాద్ ఏరియా మానవ హక్కుల సంఘం కమిటీ అధ్యక్షురాలు లతారెడ్డి, బాల వికాస వాటర్ ప్లాంట్ కో ఆర్డినేటర్స్ లీలా, రజిత, మేకల మౌనిక, పింగిలి విజయ, మహిళలున్నారు.

క్రీడా పాఠశాలలో ప్రవేశాలకు ఎంపిక పోటీలు

గంగాధర, జూన్ 23 : తెలంగాణ క్రీడా పాఠశాల్లో (2024- 25) 4వ తరగతిలో ప్రవేశాలకు విద్యార్థులకు క్రీడా పోటీలను నిర్వహిస్తున్నట్లు ఎంఈవో అంబటి వేణుకుమార్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. 01-09-2015 నుంచి 31-08-2016 మధ్యలో జన్మించి, 3వ తరగతి పూర్తైన విద్యార్థులు పోటీల్లో పాల్గొనడానికి అర్హులని పేర్కొన్నారు. ఈ నెల 25న గంగాధర జిల్లా పరిషత్ ప్రభుత్వ పాఠశాలలో నిర్వహిస్తున్నట్లు పోటీలకు ఆసక్తి గల విద్యార్థులు ఆధార్ కార్డు జిరాక్స్, పాస్‌పోర్టు సైజ్ ఫొటోలు, జనన ధ్రువీకరణ పత్రం తీసకుని ఉదయం 9 గంటల వరకు హాజరుకావాలని సూచించారు. పోటీల్లో ప్రతిభ కనబరచిన విద్యార్థులను జిల్లాస్థాయి పోటీలకు ఎంపిక చేస్తామని తెలిపారు. వివరాలకు మండల ఎస్‌జీఎఫ్ కార్యదర్శి బాబు శ్రీనివాస్ 9441700892 ను సంప్రదించాలని సూచించారు.

శ్యామ్ ప్రసాద్ ముఖర్జీకి ఘన నివాళి

హుజూరాబాద్ రూరల్, జూన్ 23 : పట్టణంలో డాక్టర్ శ్యామ్‌ప్రసాద్ ముఖర్జీ వర్ధంతిని ఆదివారం నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఇక్కడ బీజేపీ పట్టణాధ్యక్షుడు రాజు, కౌన్సిలర్లు వెంకట్ రెడ్డి, సుమన్, ప్రధాన కార్యదర్శులు రాజు, విజయ్, ఉపాధ్యక్షుడు తిప్పబత్తిని రాజు, నాయకులు ప్రభాకర్, శ్రీనివాస్, వెంకన్న, సదయ్య, తదితరులున్నారు.

చిగురుమామిడి, జూన్ 23: మండలంలోని సుందరగిరిలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కోమటిరెడ్డి రాంగోపాల్ రెడ్డి, మండల అధ్యక్షుడు పైడిపల్లి శ్రీనివాస్ శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ సేవలను కొనియాడారు. వర్ధంతిలో వివిధ గ్రామాలకు చెందిన బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వీణవంక, జూన్ 23 : మండలంలోని రెడ్డిపల్లిలో బీజేపీ ఓబీసీ మండలాధ్యక్షుడు బొంగోని ఎల్లయ్య ఆధ్వర్యంలో శ్యామ్‌ప్రసాద్ ముఖర్జీ చిత్రపటానికి పూలమాల వేసి, నివాళులర్పించారు. ఇక్కడ నాయకులు మాడ విజేందర్‌రెడ్డి, శ్రీమంతుల సురేశ్, రాచర్ల అనిల్, ఉయ్యాల రమేశ్, బండి సంపత్, ఎలుబాక చారి ఉన్నారు.

ముగిసిన బ్రహ్మోత్సవాలు


హోమం నిర్వహిస్తున్న అర్చకులు

కమాన్‌చౌరస్తా, జూన్ 23 : మంకమ్మతోట వేంకటేశ్వరస్వామి ఆలయ 14వ బ్రహ్మోత్సవాలు ఆదివారంతో ముగిశాయి. ఇందులో భాగంగా, ఉదయం నుంచి సుదర్శన, నారసింహ హోమం, పూర్ణాహుతి నిర్వహించారు. ద్వాదశారాధన, సప్తావరణాలు, ఏకాంత సేవ జరిగాయి. ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో ఎన్ శ్రీనివాస్, ఆలయ అర్చకులు, సిబ్బంది తదితరులున్నారు.

ఘనంగా ధ్వజారోహణం

ధ్వజారోహణం నిర్వహిస్తున్న అర్చకులు

కమాన్‌చౌరస్తా, జూన్ 23 : జిల్లా కేంద్రంలోని భగత్‌నగర్ హరిహరక్షేత్రం ఆవరణలోని వేంకటేశ్వరస్వామి ఆలయంలో వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా సుప్రభాత సేవ, నిత్యారాధన, అగ్నిప్రతిష్ఠ, ధ్వజారోహణం, నిత్య హోమం నిర్వహించినట్లు ఆలయ ఈవో కాంతారెడ్డి పేర్కొన్నారు. కార్యక్రమానికి భక్తులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.

జాతీయస్థాయి కరాటే పోటీలకు ఎంపిక

జాతీయస్థాయి కరాటే పోటీలకు ఎంపికైన క్రీడాకారులు

కొత్తపల్లి, జూన్ 23 : ఛత్తీస్‌ఘడ్ రాష్ట్రంలో ఈనెల 23 నుంచి జరుగనున్న జాతీయ స్థాయి కరాటే పోటీలకు జిల్లా కేంద్రానికి చెందిన దమ్మిక కాయ్ షిటోరియా అకాడమీకి చెందిన పలువురు క్రీడాకారులు ఎంపికైనట్లు అకాడమీ చీఫ్ ఆర్ ప్రసన్నకృష్ణ పేర్కొన్నారు. అండర్-14 కుమిటీ, కటా విభాగంలో మధు శ్రీ, మణితేజ, శ్రీతిక్‌నందన్, నిహాల్‌చంద్ర, 14 సంవత్సరాల పై విభాగంలో ఎండీ హషీర్ అలీ, బీ మణితేజ ఎంపికయ్యారన్నారు. వీరిని అకాడమీ ప్రధాన కార్యదర్శి బండారి సంతోష్, కోచ్ ఏ వినోద్ అభినందించారు.

క్రీడా దినోత్సవ సంబురాలు

సంబురాల్లో పాల్గొన్న విద్యార్థులు, క్రీడాకారులు

కొత్తపల్లి, జూన్ 23 : ప్రపంచ హ్యాండ్ బాల్, ఒలింపిక్ దినోత్సవాలను పురస్కరించుకొని ఉమ్మడి జిల్లా హ్యాండ్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సంబురాలను నిర్వహించారు. రేకుర్తిలోని లయోలా విద్యా సంస్థల క్రీడా మైదానంలో హ్యాండ్‌బాల్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి కేక్ కట్‌చేసి క్రీడాకారులకు స్వీట్లు పంపిణీ చేశారు. ఇక్కడ అసోసియేషన్ సంయుక్త కార్యదర్శి నమిలికొండ ప్రభాకర్, కోచ్ మూల వెంకటేశ్, నాగుల శ్రీనివాస్, శ్రీకాంత్, విజయ్, అమర్, శివాజీ, రాజు, సాయికృష్ణ, సీనియర్ క్రీడాకారులు శ్రీనివాస్, మల్లేశ్, లక్ష్మీరాజం, దిలీప్, తిరుమలేశ్ తదితరులున్నారు.

కార్మికుడి నిజాయితీ : దొరికిన పర్సు అప్పగింత

పోలీసుల సమక్షంలో హుస్సేన్‌కు పర్సు అప్పగిస్తున్న తిరుపతి

రాంనగర్, జూన్ 23: రోడ్డుపై లభించిన నగదుతో ఉన్న పర్సును అందజేసి నిజాయితీని చాటుకున్నాడు ఓ కార్మికుడు. మానకొండూర్ మండలం కొండపల్కల గ్రామానికి చెందిన షేక్ హుస్సేన్ చింతకుంటలో ఉన్న తన కూతురు వద్దకు వెళ్లి వస్తుండగా పర్సు పోగొట్టుకున్నాడు. కరీంనగర్ రెడ్ మిక్స్‌లో కార్మికుడిగా పనిచేస్తున్న ఎడపల్లి తిరుపతికి రూ.4వేల నగదుతో ఉన్న పర్సు దొరకగా, పోలీస్‌స్టేషన్‌లో అప్పగించాడు. హెడ్ కానిస్టేబుళ్లు కృష్ణారెడ్డి, మహేశ్, అలీబేగ్‌లు పర్స్‌లో ఉన్న వివరాలను పరిశీలించారు. బాధితుడికి పోలీసుల సమక్షంలో పోగొట్టుకున్న పర్సు అందజేశారు. కార్మికుడిని కొత్తపల్లి ఎస్ఐ సాంబమూర్తి అభినందించారు.

కిషన్‌కు ఆశా హాస్పిటల్ ఓరియంటేషన్ అవార్డు


అవార్డును అందుకుంటున్న డాక్టర్ పీ కిషన్

విద్యానగర్, జూన్ 23: కరీంనగర్‌కు చెందిన ప్రముఖ మానసిక వైద్యుడు డాక్టర్ పీ కిషన్ ఆశా హాస్పిటల్ ఓరియంటేషన్ అవార్డు అందుకున్నాడు. నిజామాబాద్ జిల్లా కేంద్రంలో ఇండియన్ సైకియాట్రిక్ సొసైటీ నిజామాబాద్ ఆధ్వర్యంలో అందించారు. డాక్టర్ కిషన్ వద్ద ఇప్పటివరకు చికిత్స తీసుకున్న 78 వేల మంది మానసిక వ్యాధితో బాధపడుతున్న వారి వివరాలను పొందుపర్చడమే కాకుండా మానసిక వ్యాధులపై రీసెర్చ్ చేసినందుకు అవార్డును అందించారు.డాటాబేస్ ఉంటే రీసెర్చ్ చేయవచ్చునని, ప్రతి వైద్యుడు, ప్రతి రోగి పూర్తి వివరాలను పొందుపరుస్తే చికిత్స అందించే వీలు సులభతరం అవుతుందని డాక్టర్ కిషన్ చెప్పారు. అవార్డు రావడం పట్ల కరీంనగర్‌లోని సీనియర్ వైద్యులు అభినందనలు తెలిపారు.

ప్రధాని మోడీ దిష్టిబొమ్మ దహనం

రాంనగర్, జూన్ 23 : నీట్ పరీక్షలో అవకతవకలు, అక్రమాలపై సమగ్ర విచారణ జరపాలని, దోషులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ ఇందిరా చౌక్‌లో కరీంనగర్ జిల్లా యువజన కాంగ్రెస్ శాఖ ఆధ్వర్యంలో మోడీ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా పడాల రాహుల్ మాట్లాడుతూ 24 గంటల్లోపు కేంద్ర ప్రభుత్వం నీట్ పరీక్ష విషయంలో స్పందించకపోతే తెలంగాణలో ఉన్న కేంద్ర మంత్రులు కిషన్ రెడ్డి, బండి సంజయ్ ఇండ్లు, క్యాంప్ కార్యాలయాలు ముట్టడిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ కమిటీ అధికార ప్రతినిధి రేగొండ సందీప్, అనిల్ ముదిరాజ్, నవాజ్, కృపసాగర్, అజీమ్, గట్టు ప్రశాంత్, మాడుగుల ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.